క్లుప్తంగా

మానుకోటలో మోస్తరువర్షం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంతోపాటుగా మానుకోట మండలంలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి చిరుజల్లులతో మొదలై సుమారు గంటపాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ మార్కెట్, గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకున్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వాహనాల తనిఖీ

కొత్తగూడ: ఏటూరునాగారం మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు మావోయిస్ట్ ప్రతీకార చర్యలకు పాల్పడకుండా కొత్తగూడ ఎస్సై కుశకుమార్ విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇటీవల మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి ని హత్య చేయడం, కొద్ది రోజుల వ్యవధిలోనే పోలీసులు భారీ ఎన్‌కౌంటర్‌తో సమాధానం చె ప్పడం తెలిసిందే. దీని ప్రభావం కొత్తగూడ, గంగారం మండలాలపై పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసిన జిల్లా పోలీసులు అప్రమత్తమై తనిఖీలు, కూంబింగ్ చేస్తున్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

కొత్తగూడ : అటవీ, వన్యప్రాణుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నారు. ఆదివారం మండలంలోని చెరవుముందుతండా, బొత్తవానిగూడెం, రంగప్పగూడెం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో డీఆర్వో కరుణ, ఎఫ్‌ఎస్‌ఓ రాజేష్, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ

తొర్రూరు రూరల్: చెర్లపాలెం ఆటో యూనియన్ నూతన కమిటీని ఆదివారం స్థానికంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మారపు శ్రీను, ఉపాధ్యక్షుడిగా ఎండీ యాకూబ్, ప్రధాన కార్యదర్శిగా పెద్దబోయిన శ్రీను, కోశాధికారిగా చిట్టిమళ్ల వెంకన్న, సహాయ కార్యదర్శిగా ధర్మారపు యాకూబ్, సలహాదారులుగా వీరస్వామి, సుధాకర్ ఎన్నికయ్యారు.

పిల్లలకు వాకర్స్ అండ

కురవి: మండలంలోని బలపాల గ్రామానికి చెందిన గోల్కొండ హేమలత రెండేళ్ల క్రితం, తన భర్త వెంకట్రాములు ఇటీవల కేన్సర్ వ్యాధితో మృతి చెందారు. దీంతో తల్లిదండ్రుల మృతితో ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. స్పందించిన బలపాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మానవతాదృక్పథంతో రూ.20వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. ఇద్దరు ఆడపిల్లల పేరుపై బ్యాంకులో డిపాజిట్ చేశారు.

మార్మోగిన శరణుఘోష


గూడూరు : మండలంలోని కోబల్‌తండాలో కార్తీక చివరి ఆదివారం అయ్యప్పస్వామి అభిషేక పూజలో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కన్నెస్వామి తేజావత్ శ్రీనివాస్ స్వగృహంలో గురుస్వామి శ్రీనివాస్, బాలు, బిచ్చానాయక్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములతో పాటు తండావాసులు తీర్థప్రసాదాలతో పాటు భోజనాలు చేశారు.

టూ వీలర్ మెకానిక్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



మహబూబాబాద్ రూరల్ : జిల్లా టూ వీలర్ మెకానిక్ యూనియన్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. గత రెండేళ్లుగా మెకానిక్ సంఘానికి చేసిన ఉత్తమ సేవలను గుర్తించి రెండోసారి ఏకగ్రీవంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మండ విక్రం గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెన్ను అనిల్ కుమార్, సమ్మెట వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల మధు, కోశాధికారిగా వెన్ను శివశంకర్ ఎన్నికయ్యారు.

మోటార్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



తొర్రూరు : స్థానిక మోటార్ ఓనర్లు, డ్రైవర్ల యూనియన్ నూతన కమిటీని ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిలుకర దామోదర్, గౌరవ అధ్యక్షుడిగా మునుకుంట్ల యాకయ్య, ఉపాధ్యక్షులుగా పొన్నం సంపత్, కోట్ల యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా బోయిన మల్లేష్, కార్యదర్శిగా మేకల వెంకన్న, కోశాధికారిగా పెదగాని సమ్మయ్యలు ఎన్నికయ్యారు. యూనియన్ కమిటీ ప్రతినిధులను మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నమనేని శ్రీనివాసరావులు అభినందించారు. యూనియన్ ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్షుడు దామోదర్ తెలిపారు.

మున్నేరు కల సాకారమయ్యేనా!

- ప్రాజెక్ట్ నిర్మాణానికి మోక్షమెప్పుడో?
- నిర్మిస్తే 30 వేల ఎకరాలకు లబ్ధి



పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించే ప్రతిపాదిత స్థలం (ఫైల్)



ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ మాజీ సీఎం వైఎస్‌ఆర్‌ను కలిసిన నాటి ఎమ్మెల్యే నర్సయ్య(ఫైల్)

గార్ల : సీమాంధ్ర సీఎంలు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలకుల పక్షపాత ధోరణి వల్ల దశాబ్దాలుగా మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టలేదు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తోనైనా మున్నేరు ప్రాజెక్ట్ కల సాకారమయ్యేనా అని ఈ ప్రాంత రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాంతంలో పాకాల ఏటి వరద నీళ్లు వర్షాకాలంలో 3 నెలల పాటు వృథాగా వెళ్లి కృష్ణానదిలో కలుస్తుంటాయి. నాడు ఈ ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు 40 ఏళ్ల క్రింతం ఈ ప్రాంతంలో మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించడంతో 30 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని తెలపడంతో నాటి సీఎం జలగం వెంగళరావు స్పందించి ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులను సర్వేకు పంపించినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎందరో సీఎంలు మారినా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం సర్వేలకే పరిమితమైంది. గార్ల మండలం ముల్కనూరు సమీపంలోని పాకాల ఏటిపై ప్రతిపాదించిన మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి 4 దశాబ్దాల పోరాటాల ఫలితంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వహయాంలో పట్టుదలతో, ఆయన ఆదేశం మేరకు నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యానాథన్ ఎట్టకేలకు 2009 మార్చి 2న రూ.131.67 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణానికి పరిపాలన ఆమోదం తెలుపుతూ జీఓ నంబర్ 1076 ను విడుదల చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం 2009 ఎన్నికల ముందు మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఆయన నిధులు విడుదల చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే గార్ల, కామేపల్లి, డోర్నకల్, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరుతో పాటు తాగునీరు సైతం అందుతుంది. మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం మున్నేరు జనసాధన కమిటీని ఈ ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల నాయకులతో నియమించుకున్నారు. ఈ కమిటీలో జనసాధన కమిటీ చైర్మన్‌గా నాటి ఇల్లందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను ఎన్నుకున్నారు. పలుమార్లు నర్సయ్యతో కమిటీ సభ్యులు గోపగాని శంకర్‌రావు, తదితరులు కలిసి పలుమార్లు ప్రాజెక్ట్ కోసం నాటి రాష్ట్ర సీఎంలను, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్ట్ నిర్మించాలి



ప్రతీయేటా వర్షాకాలంలో 3 నెలలు పాకాల ఏటి నుంచి నీళ్లు వృథాగా వెళ్లి కృష్ణా నదిలో కలుస్తున్నాయి. ఇక్కడ మున్నేరు ప్రాజెక్ట్ నిర్మిస్తే 35 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

– మాలోత్ బిక్షం రైతు, సీతంపేట

రెండు పంటల సాగు



ప్రాజెక్ట్ నిర్మిస్తే ఖరీఫ్, రబి రెండు పంటలు సాగవుతాయి. సర్వేలు కాగి తాలకే పరిమితమయ్యా యి తప్ప ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

– వై.కృష్ణారెడ్డి రైతు, రాంపురం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2002–03 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక వేంకటేశ్వరస్వామి అలయ సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు బోధించిన గురువులకు సన్మానం చేశారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, సామిరెడ్డి, ఈరగాని భిక్షం, రవిశంకర్, అన్వర్, బుచ్చిరెడ్డి, విష్ణులకు శాలువాలతో సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు చిల్యాల నరేష్, రమేష్, సమ్మయ్య, ప్రభాకర్, నర్సయ్య, శేషు, రాజు, రవి, కరుణ, స్వాతి ప్రవంతి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



కొత్తగూడ : మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని కేటాయిస్తూ నిర్మాణం కోసం రూ.13.5 కోట్ల నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కల చిత్రపటాలకు రెండు మండలాల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడారు. కార్యక్రమంలో గంగారం, కొత్తగూడ మండలాల నాయకులు వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, రూప్ సింగ్, రణధీర్, పుష్పలత, రమ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

తొర్రూరు: ఐక్యతతోనే ముదిరాజ్ సామాజికవర్గ సమస్యల పరిష్కారం సాధ్యమని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అన్నారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి కార్యక్రమం ఆదివారం డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్తూపం ఎదుట నిర్వహించారు.

నెల్లికుదురు: కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ పాల్గొని కిష్టయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

గడ్డిమోపులు దగ్ధం

కేసముద్రం: ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న గడ్డిమోపులకు విద్యుత్ తీగలు తాకి షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు అంటుకుని దగ్ధమైన సంఘటన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పాతతండాకు చెందిన లచ్చిరాం తన పంటపొలం నుంచి గడ్డిమోపులను ట్రాక్టర్ ద్వారా ఇంటికి తీసుకెళ్తుండటంతో మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తాకి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది.

లారీ బోల్తా

గంగారం : అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘన మండలంలోని పోలవరం, తిరుమలగండి గ్రా మాల మధ్య ఆదివారం జరిగిందని ఎస్సై రవి కుమార్ తెలిపారు. జగిత్యాల నుంచి అశ్వాపురంకు పీడీఎస్ రైస్ లారీ వెళ్తుండగా మహబూ బాబాద్ జిల్లా గంగారం మండలంలోని పోలవరం, తిరుమలగండి మధ్య అదుపు తప్పి లారీ బోల్తా పడింది.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

గార్ల: సీపీఐ మండల సీనియర్ నాయకుడు పల్లా కోటి(52) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి భౌతిక కాయాన్ని సీపీఐ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బాలమల్లేష్ మృతి తీరనిలోటు

నెహ్రూసెంటర్ : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలి

డోర్నకల్: రెండో విడత రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను డోర్నకల్‌లో ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ విద్యావసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

గార్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక రాజకీయాలకతీతంగా పారదర్శకంగా నిర్వహించి, గ్రామసభల ద్వారా అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి షరతులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులను కోరారు.

బయ్యారం : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు రుణమాఫీ పథకం వర్తింప చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు.పార్టీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఏఐకెఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

కార్మికులకు వాటా కేటాయించాలి

కురవి: సంక్షేమ పథకాల్లో కార్మికులకు వాటా కేటాయించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని తట్టుపల్లి గ్రామంలో సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మికసంఘం సమావేశంలో యన మాట్లాడారు.

ఉద్యోగులు ప్రజాసేవకు కదలాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవకు కదలాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్ అన్నారు. తాజా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా కొలువులు సాధించిన పలువురిని ఆది వారం హరిపిరాల జీపీ ఆవరణలో సత్కరించారు.

ఫారెస్ట్ ఫైర్‌పై అవగాహన

గంగారం: మండల కేంద్రంలో ఫారెస్ట్ ఫైర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలకు తీరని లోటు

కురవి: సీపీఐ రాష్ట్ర నాయకుడు బాల మల్లేష్, పోటు ప్రసాద్‌ల అమరత్వం ప్రజాఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మల్లేష్, ప్రసాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకన్న ఆశయ సాధనకు కృషి

మరిపెడ రూరల్: కామ్రేడ్ బయ్య వెంకన్న ఆశయ సాధనకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అన్నారు. మండలంలోని గుండెపుడిలో వెంకన్న 4వ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని ఆదివారం నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

బయ్యారం/నెల్లికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న పలు పథకాలపై ఆదివారం సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత ప్రదర్శనలు ఇచ్చారు. బయ్యారం, నెల్లికుదురు మండలాల్లోని జగ్గుతండా, వెంకట్రాంపురం, బాలాజీపేట, రత్తిరాంతండా, నైనాల, పార్వతమ్మగూడెం, గ్రామాల్లో ఆటాపాట ద్వారా ప్రజలకు వివరించారు.

అన్నప్రసాదం పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : అమావాస్య సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిన ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కురవి మండలంలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ మహాసభకు జిల్లా కేంద్రం నుంచి ఆదివారం ఉపాధ్యాయులు, సంఘం నాయకులు తరలివెళ్లారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు నిర్వహిస్తున్నమన్నారు.

బంగారు మైసమ్మ తల్లికి పూజలు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని రెడ్యాలలో కొలువై ఉన్న బంగారు మైసమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిందురెడ్డి, మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపెల్లి ఉపేంద్రం, ఏబీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇనుగుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కురవి: మండలంలోని నేరడలో డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ షరీఫ్, నవీన్‌కుమార్ బృందం ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి,మందులను అందజేశారు.

వైస్ చాన్స్‌లర్‌ను కలిసిన కృష్ణారెడ్డి

మరిపెడ రూరల్: హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దండా రాజిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మరిపెడకు చెందిన తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ బోర్డు సలహా సభ్యుడు వల్లూరి కృష్ణారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

సింహగర్జనకు తరలిన మాలలు

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు నర్సింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు మండలాల నుంచి వేలాది మంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసి ప్రభుత్వాలు మాలలకు అన్యాయం చేశాయన్నారు. కార్యక్రమాల్లో మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుండాల భిక్షం, గడ్డి నరేష్, గొడిశాల ఉప్పలయ్య, సంజీవరావు, పాపి, సుధాకర్, మనో హర్, చంద్రశేఖర్, దేవస్వామి, మాలమహానాడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెద్దముప్పారం నుంచి తరలిన మాలలు

అమరుల త్యాగాలు మరువలేనివి : రమేశ్‌నాయక్

మరిపెడ రూరల్ : తెలంగాణ అమరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివాని లంబాడీల ఐక్యవేదిక (లైవ్) రాష్ట్రముఖ్య సమన్వయకర్త గుగులోతు రమేష్‌నాయక్ అన్నారు. మండలంలోని వెంకట్యతండాలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన భూక్య ప్రవీణ్ నాయక్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ ప్రవీణ్‌నాయక్, మండల కోర్డినేటర్ దేవేందర్, బాసు, రాజేష్, వెంకటేష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కురవి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మహబూబ్ అలీ ప్రాంగణంలో సంఘం జిల్లా ఐదవ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మల్లారెడ్డి, సోమశేఖర్, శ్రీనివాస్, మురళీ కృష్ణ, యాకూబ్, వెంకటేశ్వర్లు, జనర్ధానాచారి, మంజుల, హరినాయక్, మంగయ్య, వివేక్, రమేష్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడారంగంలో రాణించాలి



జిల్లా కబడ్డీ జట్టుతో ఎస్సై దీపికరెడ్డి, అసోసియేషన్ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: బాలికలు, యువతులు క్రీడారంగాల్లో రాణించి ప్రథమంగా నిలవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎస్సై వి. దీపికరెడ్డి, అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎస్సై, డీఈఓ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో ముందుడాలని, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో మానుకోట జిల్లా అగ్రస్థానంలో ఉండాలని, గెలుపొందిన వారికి ట్రాక్ షూట్లు అందిస్తామన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి 6వ తేదీ వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఈ నెలలో 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగే సీనియర్స్ ఉమెన్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చాంప్లానాయక్, ఉపాధ్యక్షులు ఏకాంబరం, శ్రీనివాస్‌యాదవ్, అనిల్, బాధ్యులు అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి

- డీసీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్

మహబూబాబాద్ : పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని డీసీఎస్‌ఓ ప్రేమ్ కుమార్ అన్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ సహకారంతో హెచ్‌పీ గ్యాస్ మానుకోట డీలర్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా గీత, భవాని వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ మానుకోట డీలర్ సురేష్‌బాబు, మేనేజర్ బోనగిరి ప్రసాద్, సేల్స్ ఆఫీసర్ పవన్, బొడ్డుపల్లి ఉపేంద్రం, ఫరీద్, మల్లయ్య మహిళలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులసాధనకు పోరాడాలి

- బీసీడబ్ల్యూ–సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య



మాట్లాడుతున్న ఉప్పలయ్య

మరిపెడ రూరల్: కార్మిక చట్టంలో కార్మికులకు రావాల్సిన హక్కుల సాధనకు ఉద్యమించాలని బీసీడబ్ల్యూ–సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య పిలుపునిచ్చారు. మండలంలోని బుర్హాన్‌పురంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) అనుబంధ సంస్థ గ్రామ కమిటీ సమా వేశం అమీన్ సాబ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి హాజరైన ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మికుల శ్రమ నుంచి ప్రభుత్వానికి చెల్లించిన పన్నులను సెస్ రూపంలో కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీసీడబ్ల్యూ–సీఐటీయూ బు ర్హాన్‌పురం మండల కమిటీని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మికులు ముత్తయ్య, అమీన్‌సాబ్, నూతన గ్రామ అధ్యక్షుడు పోసాని శ్రీనివాస్, కార్యదర్శి సోమారపు సైదులు, గణేష్, ఉప్పలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా నర్సింహులపేట, డోర్నకల్,గూడూరు, తొర్రూరు, దంతాలపల్లి, నెల్లికుదురు, చిన్నగూడూరు, గార్ల, పెద్దవంగర మండల కేంద్రాల్లోని పలు హైస్కూల్‌లో ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యా ర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు వి ద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటుగా బహుమతుల ను అందచేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కా ర్యక్రమాల్లో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యా యులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



దంతాలపల్లి : బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



చిన్నగూడూరు : విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ రవికుమార్



తొర్రూరు : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాంచంద్రయ్య

సంస్కృతీ సంప్రదాయాలను పాటించాలి



ఉసిరిచెట్టుకు పూజ చేస్తున్న కౌండిన్య మహిళలు

గూడూరు: అనాదిగా వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలతో పాటు కుల ఆచారాలను తప్పకుండా పాటించాలని విశ్వహిందూ పరిషత్ ఖమ్మం కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఇన్‌చార్జ్ బాలాజీగౌడ్ అన్నారు. మండలంలోని మట్టెవాడ సమీప అటవీ ప్రాంతంలో కార్తీకమాసం చివరి ఆదివారం సందర్భంగా మండల కౌండిన్య పాదుపు సంఘం (గోపా) ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 500 మంది గోపా కుటుంబాలు పాల్గొన్నాయి. ముందుగా మహిళలు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో గోపా సంఘం జిల్లా బాధ్యులు బిక్కి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకన్న, ముక్తీశ్వర్‌గౌడ్, పాటు మండల సంఘం బాధ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళిగౌడ్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి బాలికల హాస్టల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు

మహబూబాబాద్ అర్బన్: అర్ధరాత్రి సమయంలో బాలికల హాస్టల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వారం క్రితం ప్రవేశించారని ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్, జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీ కార్యాలయం సమీపంలో ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల హాస్టల్ ముందు ఆదివారం లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు నిరసన తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, మెనూ పాటించని హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.